ఎట్టకేలకు డీఎస్సీ

- 11,062 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 పోస్టుల గుర్తింపు
- గుర్తించిన పోస్టుల కంటే ఉపాధ్యాయ ఖాళీలే అధికం
- మెగా డీఎస్సీ ప్రకటనతో సంతోషంలో అభ్యర్థులు

రాష్ట్రంలో తొలిసారిగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. తెలంగాణ ఏర్పాటు ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన జరిగింది. రాష్ట్రం ఏర్పడిన తరువాత పదేళ్లుగా అధికారం చేపట్టిన బీఆర్ఎస్ హయాంలో విద్యా సంబంధిత పోస్టుల భర్తీ పెద్దగా జరగలేదు. గురుకులాల పోస్టులతో పాటు భాషాపండితులు, టీఆర్టీలు భర్తీ జరిగినప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీకి మాత్రం పెద్దగా శ్రద్ధ చూపలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొందరగానే డీఎస్సీ నోటిఫికేషన్ వేసి.. పోస్టులను భర్తీ చేస్తామని చెప్పింది. ఈ నేపథ్యంలో 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చాలామంది టీచర్ పోస్టులకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కొంత ఊరట లభించిందని చెప్పవచ్చు. అయితే ముందు ముందు పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో.. ఆ తర్వాతనే పరీక్ష నిర్వహించే అవకాశం ఉంటుంది.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెంచాలి..



ఎస్జీటీ పోస్టులు నోటిఫికేషన్‌లో 6,500లకు పైగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,629 మాత్రమే ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులకు చాలామంది పరీక్ష రాసి జాబ్స్ సంపాదిస్తున్నారు. మళ్లీ ప్రమోషన్లపై, ఓపెన్ బీఈడీ చేస్తూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధిస్తున్నారు. బీఈడీ చేసిన వాళ్లం మేము స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎదురుచూస్తూనే ఉంటున్నాం.

- రమేష్, డీఎస్సీ అభ్యర్థి, వనపర్తి

నోటిఫికేషన్‌తో సంతోషం..



గత ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలా ఎదురుచూశాం. ఏళ్లుగా కోచింగ్ తీసుకుంటూ.. సొంతంగా ప్రిపేర్ అవుతున్నాం.. నోటిఫి కేషన్ రిలీజ్ చేస్తామంటారు.. కానీ చేయకుండా నిరుద్యోగులను నిరుత్సాహపరిచారు. ఇప్పటికైనా నోటిఫికేషన్ రిలీజ్ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు.. అదే విధంగా సమయానికి పరీక్ష కూడా నిర్వహించాలి.

- శిరీష, డీఎస్సీ, అభ్యర్థి, నారాయణపేట

టీచర్ ఉద్యోగం జీవిత లక్ష్యం..



ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్నది నా జీవిత లక్ష్యం.. 2014-15 విద్యా సంవత్సరంలో డీఈడీ పూర్తిచేసి టెట్‌లో అర్హత సాధించి, డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాను. అన్ని విధాల సమాయత్తం అవుతున్నప్పటికీ.. డీఎస్సీ విడుదల కాకపోవడం, ప్రతీసారి మాటలు చెప్పి.. ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు మెగా డీఎస్సీ నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

- మయూరి, డీఎస్సీ అభ్యర్థి, గద్వాల

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రం మొత్తంలో 11,062 పోస్టులకు మెగా డీఎస్సీ ప్రకటించింది. అయితే ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత కలిపి 3,100 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 14,333 టీచర్ పోస్టులకు మంజూరు ఉంది. 12,531 పోస్టుల్లో మాత్రమే టీచర్లు ఉన్నారు. గత ప్రభుత్వం పదవీ విరమణ వయసు పెంచడంతో చాలామంది అలాగే విధుల్లో కొనసాగుతున్నారు. ఈ సంవత్సరం మధ్యలో నుంచి పెంచిన గడువు కూడా పూర్తయితే ఇంకా ఖాళీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఉమ్మడి పాలమూరులోని నాగర్‌కర్నూలు, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కలిపి 1,805 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవి మరో ఆరు నెలల్లో పెరిగే అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం పదవీ విరమణ పొందాల్సిన వారంతా ఇప్పుడు క్యూలో ఉన్నారు. ఇక ప్రస్తుతం ఉమ్మడి పాలమూరులో 1,131 పోస్టులను తాజాగా విడుదల చేసిన డీఎస్సీలో భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలపగా.. ఇప్పుడున్న ఖాళీలే ఇంకా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఆ పోస్టులను కూడా దశలవారీగా భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం 1,131 పోస్టులు పోను అధికారుల అంచనాల ప్రకారమే ఇంకా 674 ఖాళీలు ఏర్పడనున్నాయి. అలాగే ఖాళీగా ఉన్న పోస్టుల్లో చాలావరకు పదోన్నతుల కోసం తీయగా.. మిగిలిన పోస్టులను భర్తీ చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 172 పోస్టులు భర్తీ చేయనుండగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో 243, నాగర్‌కర్నూలులో 285 పోస్టులు, నారాయణపేటలో 275 పోస్టులు, వనపర్తిలో 152 పోస్టులు భర్తీ కానున్నాయి.

జిల్లాల వారీగా పోస్టులు...

జిల్లా పేరు	స్కూల్ అసిస్టెంట్	ఎల్పీ	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేటర్స్
మహబూబ్‌నగర్	38	24	8	146	27
జోగులాంబ గద్వాల	35	28	8	80	21
నాగర్‌కర్నూలు	70	18	2	141	54
నారాయణపేట	73	23	1	161	21
వనపర్తి	57	9	6	56	24

ఎంఈవోలు ఏరీ..

చాలా ఏళ్లుగా ఉమ్మడి పాలమూరులోని అన్ని మండలాల్లో ఎంఈవోలు లేరు. పలు మండలాల్లో సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. అలాగే ఒక్కో ఎంఈవో రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలను కూడా చూసుకుంటున్నారు. మండల స్థాయిలో అధికారి లేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరు ఇష్టారాజ్యంగా మారిందని చెప్పవచ్చు. చాలామంది పాఠశాలలకు వెళ్లకుండానే ప్రైవేటు పనులు చక్కదిద్దుకుంటున్నారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులైతే.. అసలు పాఠశాలల మొఖం చూడటం లేదు. మండల స్థాయిలో పర్యవేక్షణ సరిగా లేక.. ప్రభుత్వ విద్యావ్యవస్థ చాలా దెబ్బతింటోంది. ముఖ్యంగా తండాల పాఠశాలలు, ప్రైమరీ పాఠశాలల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. ఉన్నత పాఠశాలల్లో ఎక్కువ మంది టీచర్లు ఉన్నందువల్ల ఒకరిపై ఒకరు చెప్పుకుంటారని, కొంత హాజరు శాతం మెరుగ్గా ఉంటున్నప్పటికీ.. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో మాత్రం టీచర్ల పనితీరు దారుణంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి.



6న పాలమూరుకు సీఎం రేవంత్‌రెడ్డి?

- బహిరంగ సభకు స్థలం చూస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల ఆరున పాలమూరుకు రానున్నారు.. జిల్లా కేంద్రంలో బహిరంగసభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అధికారికంగా ప్రకటన ఇంకా రాకపోయినా పార్టీశ్రేణులు మాత్రం దాదాపుగా ఖరారు అయినట్లుగానే చెబుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు స్థల పరిశీలన చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున ముఖ్యమంత్రి భారీ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అదేరోజు ప్రముఖ పారిశ్రామిక వేత్త మన్నె జీవన్‌రెడ్డి, ఆయన అనుచరులు పెద్దఎత్తున సీఎం సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు సమాచారం. మరోవైపు సీఎం పర్యటన నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. సభ నిర్వహించే స్థలం ఫైనల్ అయితే బందోబస్తు పరంగా చర్యలు తీసుకోకున్నారు.

చికెన్ ధరలకు రెక్కలు

- పెళ్లిళ్ల సీజన్‌లో పెరిగిన డిమాండ్
- ఎండ వేడికి మృత్యువాత పడుతున్న కోళ్లు
- వేసవిలో కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపని రైతులు
- ప్రతీ రోజు జిల్లాలో 70వేల కిలోల చికెన్ అమ్మకాలు
- రానున్న రోజుల్లో కిలోకు రూ.300 దాటనున్న చికెన్ ధరలు



కొల్లాపూర్, ఫిబ్రవరి 29 : వేసవి ప్రారంభంలోనే ఎండలు అధికమవడంతో కోళ్లు ఎండవేడికి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. దీంతో వ్యాపారులు చికెన్ ధరలను అమాంతం పెంచేశారు. వేసవిలోనే ఎక్కువగా పెళ్లిళ్లు, ఇతర దావత్‌లు అధికంగా ఉంటాయి. ఈ సీజన్‌లో చికెన్‌కు డిమాండ్ ఉంటుంది కానీ ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు ఆకాశాన్నంటుతాయి. చికెన్ కిలో ప్రస్తుతం రూ.270 వరకు చేరుకుంది. మరో నెల రోజుల్లో రూ.300లు దాటినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు 70వేల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతున్నట్లు చికెన్ సరఫరా చేసే కంపెనీదారులు అంచనా వేస్తున్నారు. వేసవిలో ఎండ వేడిక కోళ్లు చనిపోతాయి. బరువు కూడా ఎక్కువగా రావు. దీంతో రైతులు ఎండాకాలంలో కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపరు. దీనివల్లే డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరుగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాకు జడ్చర్ల, షాద్‌నగర్, పెబ్బేరు, తెలకపల్లి ప్రాంతాల నుంచి కోళ్ల సప్లయ్ ఉంటుంది. అక్కడక్కడా రైతులు సొంతంగా తమ షెడ్లలో పెంపకం చేసే కోళ్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తారు.

వేసవి కాలంలో నష్టాలే..



ప్రస్తుతం మండుతున్న ఎండాకాలంలో కోళ్లకు సోకే వ్యాధుల వల్ల అవి మృత్యువాత పడుతున్నాయి. షెడ్లలో లక్ష పిల్లలు పెడితే 20వేల వరకు అవి మృత్యువాత పడుతున్నాయి. దీంతో లాభాల కన్నా నష్టాలే మిగులుతాయి. వేసవిలో పెట్టుబడి కూడా అధికంగానే ఉంటుంది. డిమాండ్‌కు తగ్గ సప్లయ్ కూడా చేయలేక పోతున్నాం. మరో మూడు నెలలు ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

- గుగ్గిళ్ల రాజశేఖర్, కోళ్ల పెంపకందారు, కొల్లాపూర్

ముగిసిన వంతెన మరమ్మతులు

- రేపు జాతీయ రహదారి ప్రారంభం



వంతెనపై వేసిన సీసీ రోడ్డుపై ఎయిర్ కటింగ్ చేస్తున్న కార్మికుడు

కృష్ణ, ఫిబ్రవరి 29 : కృష్ణానదిపై బస్సు వంతెన మరమ్మతు పనులు పూర్తి కావడంతో శనివారం తెల్లవారు జాము నుంచి రాకపోకలు ప్రారంభం కానున్నట్లు శక్తినగర్ ఎస్ఐ సరళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 16వ తేదీ నుంచి దాదాపు 45 రోజులు ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని గుడెబల్లూరు గ్రామ శివారులోని కృష్ణానదిపై (167వ నెంబరు జాతీయ రహదారి)ఉన్న వంతెనపై రోడ్డు గుంతలు పడటంతో మరమ్మతుల కోసం రాకపోకలను నిలిపివేశారు. మరమ్మతు పనులు పూర్తి కావడంతో శనివారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల రాకపోకలతో వంతెన దెబ్బతింటుందని, ఇప్పటికైనా అలాంటి వాహనాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుడ్డు బజ్జి గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి

మదనాపురం, ఫిబ్రవరి 29 :గుడ్డు బజ్జి గొంతులో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోవిందహళ్ళి గ్రామానికి చెందిన తెలుగు తిరుపతయ్య (39) బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు కొత్తకోట పట్టణం నుంచి గుడ్డు బజ్జీలు ఇంటికి తీసుకువెళ్లాడు. ఆరు బయట కూర్చొని వాటిని తింటుండగా గొంతులో ఇరుక్కొని కిందపడిపోయాడు. స్థానికుల సహాయంతో అతని భార్య సువర్ణ కొత్తకోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది సంవత్సరాల కిందట ఈ గ్రామంలో ఇలాంటి సంఘటనే జరిగిందని గ్రామస్థులు తెలిపారు.

పాడికి ప్రోత్సాహకం కరవు

- జిల్లాలో రూ. 20 కోట్ల బకాయి
- మూడున్నరేళ్లుగా అందని ప్రోత్సాహకం
- సాధారణ బిల్లుల చెల్లింపులో జాప్యం
- ఆందోళనలో పాడిరైతులు

వెల్దండ, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. ప్రతీయేటా వ్యవసాయంలో ఆటుపోట్లను ఎదుర్కొనే రైతులు తమ ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు పాడిరంగాన్ని ఎంచుకోవాలని 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వం సూచించింది. ఇందులో భాగంగా విజయ డైరీలో పాలుపోస్తే రైతులకు లీటరుకు నాలుగు రూపాయలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలంలో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. పథకం ప్రారంభించిన మొదట్లో రైతులకు ప్రోత్సాహకం పాల బిల్లులో కలిపి అందించేవారు. అనంతరం కొద్దికాలానికి ప్రోత్సాహకం బిల్లులు పెండింగ్‌లో పెట్టి విడతల వారీగా చెల్లించేవారు. కాగా 2020 ఏప్రిల్ నుంచి ప్రోత్సాహకంగా ఇచ్చే నాలుగు రూపాయలు పెండింగ్ పెట్టారు. మూడున్నరేళ్లుగా ప్రోత్సాహకం పెండింగ్‌లో ఉండడంతో రైతులకు ఇచ్చే బకాయిలు కోట్లల్లో పేరుకుపోయాయి.



పాలకేంద్రంలో పాలుపోస్తున్న రైతు

జిల్లాలో రూ. 20 కోట్ల పైగా పెండింగ్

రాష్ట్రంలో పాల దిగుబడిలో నాగర్‌కర్నూల్ జిల్లా రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండడం, నీటి వనరులు తక్కువగా ఉండడంతో ఇక్కడి రైతులు పాడిరంగాన్ని ఎంచుకున్నారు. జిల్లాలో 7,500 మంది రైతులు విజయ డైరీకి పాలుపోస్తున్నారు. జిల్లాలో కల్వకుర్తి, అచ్చంపేటలో పాలశీతలకేంద్రాలు ఉండగా, వెల్దండ, ఊర్కొండ, కొండారెడ్డిపల్లి, కుప్పగండ్ల, మాదారం, గుండూరు, నాగర్‌కర్నూల్‌లలో బీఎంసీ కేంద్రాలు ఉన్నాయి. వివిధ గ్రామాలలో 220 పాలసేకరణ కేంద్రాల ద్వారా ప్రతీనిత్యం సుమారు 68వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం ప్రోత్సాహకం అందించకపోవడంతో సుమారు రూ. 20 కోట్ల పైగానే పేరుకుపోయాయి. వేలాది రూపాయలు పోత్సాహకం పెండింగ్‌లో ఉంచడంతో పాడి పశువులను పోషించడం భారంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం అటకెక్కినట్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సాధారణ బిల్లుల చెల్లింపులో జాప్యం

పాడిరైతులకు విజయ డైరీ ద్వారా ప్రతీ 15 రోజులకోసారి బిల్లులు చెల్లిస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 16 వరకు రెండు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని రైతులకు రెండు బిల్లులకు గాను సుమారు రూ. 8.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం, అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు



పెండింగ్ బిల్లులపై పాడిరైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డీ. సత్యనారాయణ తెలిపారు. ఇటీవల మార్కెట్‌లో ప్రైవేటు పాలసేకరణ వ్యాపారుల వల్ల ఆటుపోట్లు ఏర్పడ్డాయని, వీటిని అధిగమించి రైతులకు ఇచ్చే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. పాలసేకరణ కేంద్రాలలో సబ్సిడీపై దాణా లభిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- డీ సత్యనారాయణ, టీఎస్‌డీడీ డైరెక్టర్

బిల్లులు రాక ఇబ్బందులు



ప్రభుత్వం పాడిరైతులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రతీనిత్యం కష్టపడి పాలుపోస్తే బిల్లులు రాకపోవడంతో దాణాకు, ఇతర ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాకం బిల్లు తనకు సుమారు రూ.50వేల వరకు రావాల్సి ఉన్నది.

- యెన్నం విజేందర్‌రెడ్డి , రైతు, వెల్దండ

కార్యదర్శులపై పెరిగిన పనిభారం

- సర్పంచుల పదవీకాలం ముగియడంతో వత్తిడి
- ఆర్థిక సవాళ్లతో అతలాకుతలం
- పల్లె పాలనలో నామమాత్రంగానే స్పెషల్ ఆఫీసర్ల పాత్ర



పెద్దగూడెంలో కంపచెట్లు తొలగిస్తున్న శానిటేషన్ సిబ్బందితో కార్యదర్శి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 29 : గ్రామ పంచాయతీల్లో పాలనా బాధ్యతలన్నీ కార్యదర్శులపైనే పడ్డాయి. సర్పంచుల పదవీకాలం పూర్తయిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ ఆఫీసర్ల పాలన మొదలైంది. స్పెషల్ ఆఫీసర్లు ఒక్క పంచాయతీకి మాత్రమే కాకుండా వారి సొంత శాఖలకు సేవలందించాల్సి ఉంటుంది. దీంతో పల్లెపాలనలో వారి పాత్ర నామమాత్రంగానే ఉంటున్నట్లు తెలుస్తుంది. కార్యదర్శులే పంచాయతీలకు అన్నీ తామై వ్యవహరించాల్సి వస్తుంది. ఈ క్రమంలో పనిభారం పెరగడంతో పాటు నిధులు లేక ఆర్థికంగాను పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు.

స్పెషల్ ఆఫీసర్ల పాలనలో పెరిగిన భారం

సర్పంచుల పదవీకాలం ముగిసిన వెంటనే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో స్పెషల్ ఆఫీసర్ల పాలన ప్రారంభమైంది. ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక్కో స్పెషల్ ఆఫీసర్‌ను ప్రభుత్వం కేటాయించింది. పంచాయతీల్లో పరిపాలన వ్యవహారాలను చూసుకోవాలని ఆదేశించింది. కానీ ఒక్కో స్పెషల్ ఆఫీసర్‌కు రెండు, మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పజెప్పడంతో పరిపాలనలో వారి పాత్ర నామమాత్రమే అయింది. ఆయా గ్రామ పంచాయతీల్లో తిరిగి పర్యవేక్షించడంతో పాటు, తమ మాతృ శాఖకు వారు సేవలందించాల్సి వస్తుంది. దీంతో వారు ప్రత్యేక అధికారులుగా గ్రామాల పాలన బాధ్యతలను నామమాత్రంగానే నిర్వహించాల్సి వస్తుంది. ఫలితంగా గ్రామాల్లో ప్రతీ పనిని పంచాయతీ కార్యదర్శులే దగ్గరుండి చూసుకోవాల్సి వస్తుంది. సర్పంచులు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సాధక బాధకాలను దగ్గరుండి చూసుకునేవారు. వారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడంతో చాలా వరకు సమస్యలు సర్పంచుల ద్వారానే తీరిపోయేవి. ఇప్పుడు ప్రజలకు అందుబాటులో కార్యదర్శి మాత్రమే ఉండడంతో బాధ్యతలన్నీ వారిపైనే పడ్డాయి.

ఆర్థికంగానూ తప్పని తిప్పలు

గ్రామ పంచాయతీల్లో కొన్ని నెలలుగా నిధుల సమస్య వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావల్సిన నిధులు సకాలంలో అందక నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి పనుల సంగతి అటుంచితే ప్రజల సౌకర్యార్థం తక్షణమే అందించాల్సిన సేవల కోసం కార్యదర్శులే సొంత డబ్బుతో లేకపోతే అప్పులు చేసి పనులు చేయించాల్సి వస్తోంది. వాటర్‌ట్యాంకుల క్లీనింగ్, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, మొక్కలకు నీరు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాల సంరక్షణ, నెలవారి ట్రాక్టర్ కంతులు, ట్రాక్టర్ డీజిల్, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి పైపుల లీకేజీ, పారిశుధ్యం, ఇతర అత్యవసర పనుల కోసం వెచ్చించే వ్యయాల కోసం కార్యదర్శులు అప్పులు చేయక తప్పట్లేదు. ప్రభుత్వ నిధులు అందకపోవడంతో పన్నుల ద్వారా వచ్చిన ఆదాయం గ్రామాల పరిపాలనకు ఏమాత్రం సరిపోవట్లేదు. దీంతో కార్యదర్శులే అప్పోసప్పో చేసి నెట్టుకొస్తున్నారు. సర్పంచులు ఉన్నంతకాలం ఈ భారాన్ని ఎలాగోలా వారే భరించేవారు. ప్రత్యేక అధికారులు చొరవ తీసుకుని ముందుకొచ్చే పరిస్థితి లేదు. ఫలితంగా కార్యదర్శులే ఆర్థిక సవాళ్లను ఎదుర్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

119 మందికి షోకాజ్ నోటీసులు

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా అంతే మొత్తంలో కార్యదర్శులు ఉన్నారు. ముగ్గురు సెలవుల్లో ఉండగా ప్రస్తుతం 252 మంది కార్యదర్శులు విధుల్లో ఉంటున్నారు. అయితే ఫిబ్రవరి 19వ తేదీన 119 మంది పంచాయతీ కార్యదర్శులకు జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉదయం 10 గంటల లోపు డైలీ శానిటేషన్ రిపోర్టు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయకపోవడమే దీనికి కారణమని తెలిపారు. ఉదయం పనుల కోసం వచ్చేవారిని కాదని ఫీల్డ్‌లోకి వెళ్లి పనులు చేసుకోవడం ఇబ్బంది అవుతుంది. అలాంటి సమయంలోనే డైలీ శానిటేషన్ రిపోర్టు పెట్టడంలో కాస్త ఆలస్యం అవుతుంది. అయినా గ్రామాల అభివృద్ధికి నిత్యం పాటుపడుతున్న తమను ఉన్నతాధికారులు గుర్తించకుండా నోటీసులు జారీ చేయడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందని పలువురు కార్యదర్శులు పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యాలయం ముందే కంపు



మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం ముందు పారుతున్న మురుగు



తహసీల్దారు కార్యాలయం వెనక మురుగు నీటి కుంట

బిజినేపల్లి, ఫిబ్రవరి 29 : మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, తహసీల్దారు కార్యాలయాల ముందు నుంచే మరుగు పారి దుర్గంధం కంపుతో వివిధ పనుల మీద కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లింగమయ్య కాలనీ, పోలీస్‌స్టేషన్ సమీప కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు అంతా తహసీల్దారు కార్యాలయం వెనక నిలువ ఉండడంతో చిన్నపాటి మురుగునీటి కుంట తలపిస్తుంది. ఆ నీరంతా తహసీల్దారు కార్యాలయం ముందు నుంచి పారుతూ మహిళా సమాఖ్య భవనం, ఎంపీడీవో కార్యాలయాల ముందు వరకు చేరి పందులకు ఆవాసంగా మారింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాకు వచ్చే ప్రజలు, వాహనదారులు మురుగునీటిని దాటుతూ జారీ పడిపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలనికి వచ్చిన పని అవుతుందో లేదో కాని రోగాల బారిన పడడం మాత్రం ఖాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పటించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తల్లిని చంపిన కూతురు



మృతి చెందిన వెంకటమ్మ

భూత్పుర్, ఫిబ్రవరి 29 : కూతురు చేతిలో తల్లి హత్యకు గురైన సంఘటన మండలంలోని కరివెన గ్రామంలో గురువారం జరిగింది. కరివెన గ్రామానికి చెందిన కాకి వెంకటమ్మ (60) కాకి నారమ్మ తల్లీకూతురు. నారమ్మను భర్త వదిలేయడంతో ఆమె పుట్టింట్లో తల్లివద్దే ఉంటున్నది. తాగుడుకు బానిసైన ఆమె తల్లి కాకి వెంకటమ్మను డబ్బులు ఇవ్వమని గొడవ పడుతూ ఉండేది. ఇందులో భాగంగా గురువారం ఉదయం కాకి నారమ్మ తల్లి కాకి వెంకటమ్మతో గొడవ పడింది. ఊరిబయట తల్లితో గొడవపడిన కూతురు కర్రతో తలపై గట్టిగా మోదడంతో కాకి వెంకటమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాగా చికిత్స పొందుతూ కాకి వెంకటమ్మ మృతి చెందింది. మృతురాలి కుమారుడు కాకి నర్సింహ ఫిర్యాదు మేరకు భూత్పుర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతురాలి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చంపుతామని బెదిరించిన కేసులో
నలుగురికి జైలు శిక్ష

- ముగ్గురికి రెండేళ్లు - మరో సెక్షన్లో నలుగురికి రెండు నెలలు

- తీర్పు ఇచ్చిన జిల్లా న్యాయాధికారి ఉదయ్ నాయక్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 29 : దౌర్జన్యంగా ఇతరుల పొలంలోకి ప్రవేశించి, పొలం యజమానిని చంపుతానని బెదిరించిన సంఘటనలో గురువారం నలుగురు నిందితులకు జైలు శిక్ష పడినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గట్టు మండల కేంద్రానికి చెందిన గూడూరు నాగరాజు తండ్రి బస్వా రాజప్ప పేరున గ్రామశివారులోని సర్వే నెంబర్ 258లో 39 గుంటల పొలం ఉంది. 2016, జూన్ 16న సరాబాయ్ కృష్ణ, అతడి ఆయన తమ్ముడు చిన్న ముక్కన్న ఆ పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా, నాగరాజు అడ్డుకొని, తమ పొలంలో ఎందుకు దున్నుతున్నారని ప్రశ్నించారు. దీంతో కృష్ణ, ముక్కన్నతో పాటు మరో ఇద్దరు పెద్దముక్కన్న, గుండప్ప అతడిని చంపుతామని బెదిరిస్తూ దాడికి యత్నించారు. ఈ విషయంపై బాధితుడు అదే రోజు గట్టు ఎస్ఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు విచారణ చేపట్టగా, నేరం రుజువు కావడంతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎస్పీ ఆదేశం మేరకు కోర్టులో కేసు ట్రయల్ సమయంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ టాటా బాబు, గట్టు ఎస్ఐ రామకృష్ణలు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. గురువారం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి ఉదయ్‌నాయక్ ఇరువర్గాల వాదనలు విన్నారు. నలుగురి నిందితులపై నేరం రుజువైనందున ఏ1. సరాబాయి కృష్ణ, ఏ2. చిన్న ముకన్న, ఏ3 పెద్ద ముకన్న, ఏ4 గుండప్పలకు సెక్షన్ 447 కింద రెండు నెలల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధించారు. సెక్షన్ 506 క్రింద ఏ1. సరాబాయి కృష్ణ, ఏ3 పెద్ద ముకన్న, ఏ4 గుండప్పలకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నేరస్తులకు జైలు శిక్ష పడేందుకు సహకరించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేచల్ సంజన జామవా, కోర్టు కానిస్టేబుల్ స్వామిరాజులను ఎస్పీ అభినందించారు.

12 కోట్ల మందికి పీఎన్జీ గ్యాస్ కనెక్షన్లు అందిస్తాం

» పీఎన్జీఆర్‌బీ సభ్యుడు అంజనీకుమార్ తివారి



గ్యాస్‌ను ప్రారంభిస్తున్న అంజనీకుమార్ తివారి

జడ్చర్ల, ఫిబ్రవరి 29 : దేశవ్యాప్తంగా 12 కోట్ల మందికి పీఎన్‌జీ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతోందని పీఎన్‌జీఆర్‌బీ సభ్యులు అంజనీ కుమార్ తివారి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్ మండలంలో గల బోడజానంపేట గ్రామంలో మెగా గ్యాస్ ఆధ్వర్యంలో మొట్టమొదటి పైప్ లైన్ ద్వారా నాచురల్ గ్యాస్ సరఫరాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పీఎన్జీఆర్‌బీ చేస్తున్న పీఎన్జీ డ్రైవ్‌లో భాగంగా గృహ, పారిశ్రామిక అవసరాలకు మెగా గ్యాస్ సంస్థ పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను అందజేయడం అభినందనీయ మన్నారు. మెగా గ్యాస్ సంస్థ 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు అందించనుందని, మరో 17వేలకు పైగా పీఎన్జీ స్టేషన్లు ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల కంటే ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో పైప్‌లైన్ ద్వారా నాచురల్ గ్యాస్ అందించడంపై దృష్టి పెట్టిందని, అందుకుగానూ 120 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణాలను పూర్తి చేయడంపై ఆయన అభినందించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందించేందుకు 35వేల కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో ఎస్సీఎన్జీ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, పంజాబ్, తమిళనాడులలో కూడా త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెగా గ్యాస్ చీఫ్ మేనేజర్ తిమ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



పంచనామా నిర్వహిస్తున్న అధికారులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 29 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ అడవిలో కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. గురువారం ఉదయం మైసమ్మ ఆలయ సమీపంలో కుక్కలు జింకను దాడి చేసి గాయపర్చడంతో ఆలయ సిబ్బంది గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. రేంజ్ అధికారి కృష్ణయ్య సిబ్బంది సుకన్యలు అక్కడకు చేరుకొని పరిశీలించగా జింక అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతి చెందిన జింకను పరిశీలించి పోస్టుమార్టం చేయించి ఖననం చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి

వెల్దండ, ఫిబ్రవరి 29 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని బైరాపూర్ - నగారాగడ్డ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో బాగ్‌దేవ్ తూరి (37) అనే వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బాగ్‌దేవ్ తూరి మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి వద్ద గత నెల రోజుల క్రితం వ్యవసాయ పొలంలో పనికి కుదిరాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి వెంకటయ్య బావమరిదిని వేరే గ్రామంలో వదిలివెళ్లేందుకు వెంకటయ్యకు చెందిన ద్విచక్రవాహనంపై బాగ్‌దేవ్ తూరి బయలుదేరాడు. బాగ్‌దేవ్ తూరి ఎంతకూ తిరిగిరాకపోవడంతో వెంకటయ్య అతనికి ఫోన్‌చేసినా ఫలితం లేకుండాపోయింది. కాగా గురువారం ఉదయం బైరాపూర్ - నగారాగడ్డ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి క్రిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యి బాగ్‌దేవ్ తూరి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు మృతుని భార్య పంతుదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రవి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నంబావి, ఫిబ్రవరి 29 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం బెక్కెం గ్రామానికి చెందిన భానుప్రకాష్(19) చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం ఆటోలో నుంచి దిగుతు భానుప్రకాష్ కిందపడ్డాడు. మెడ నరాలు చిట్లిపోవడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


కారుకొండ పాఠశాలకు నిధుల కేటాయింపు

● రూ.27 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నవాబ్‌పేట, ఫిబ్రవరి 29 : మండలంలోని కారుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి రూ. 27 లక్షలు మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల అదనపు తరగతుల స్థితిగతులను వివరిస్తూ ఫిబ్రవరి 26న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'నెల దాటితే నిధులు వెనక్కి' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. పాఠశాలకు అదనపు తరగతుల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్థులు ఆళ్ల భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రంగారెడ్డి, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ పాఠశాలకు నూతంగా అదనపు తరగతులు మంజూరు చేసినందుకు గురువారం ధన్యవాదాలు తెలిపారు. వీటితో పాటు కొల్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 9 లక్షలు, కంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.16 లక్షల నిధులు, జడ్పీహెచ్ఎస్ నవాబ్‌పేట కంపౌండ్ వాల్‌కు రూ. 3లక్షలు, కాకర్లపాడ్ పాఠశాల నిర్మాణానికి రూ. 13.50 లక్షలు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిద్రలోనే బాలిక మృతి



దామిని (ఫైల్)

గోపాల్‌పేట, ఫిబ్రవరి 29 : నిద్రలోనే బాలిక మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన క్యాత్రమోని రమేష్, క్యాత్రమోని శారద మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు రెండున్నర సంవత్సరాల కూతురు దామినీ ఉంది. కుటుంబ పోషణ కోసం గుంపుమేస్త్రీ వద్దకు వెళ్తు తల్లిదండ్రుల దగ్గర క్యాత్రమోని అలివేల, అంజనేయులు వద్ద దామినిని వదిలివెళ్లారు. గురువారం తెల్లవారుజామున అలివేల లేచి చూసే సరికి దామిని ముక్కులో నుంచి రక్తం వచ్చి, చేతులు పైకి పెట్టుకొని బిగిసుకుపోయి ఉంది. ఎంత పిలిచినా పలకకపోవడంతో చుట్టుపక్కల వారికి చెప్పడంతో స్థానికులు వచ్చి చూడడంతో అప్పటికే దామిని ముక్కు రంధ్రాల నుంచి రక్తం కారుతూ ఉంది. గుంపులో వెళ్లిన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు శవంలా ఇంటి ముందు పడుకోబెటడంతో తల్లిదండ్రుల రోదనకు హద్దులు లేకుండా పోయాయి.

శివస్వాములూ... జర జాగ్రత్త

» అటవీ మార్గం ప్రమాదకరం.. రహదారి మార్గమే సురక్షితం

» అడవులూ.. వన్యప్రాణులను కాపాడుకుందామంటున్న అటవీశాఖ

» మన్ననూరు నుంచి దోమలపెంట వరకు చలి వేంద్రాలు

» 24 గంటలు పెట్రోలింగ్ బృందాల తనిఖీలు



పాదయాత్రగా శ్రీశైలం క్షేత్రానికి వెళ్తున్న శివ స్వాములు (ఫైల్)



విశ్రాంతి తీసుకుంటున్న శివ స్వాములు

మన్ననూర్, ఫిబ్రవరి 29 : శివస్వాములు తమ ఇరుముడులను సమర్పించేందుకు వెళ్లే సమయం ఆసన్నమైంది. వచ్చే వారం రోజులూ శివ స్వాములంతా మన్ననూరు నుంచి మొదలయ్యే అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో తమ పాదయాత్రను కొనసాగిస్తారు. శివరాత్రి ముగియక ముందే నల్లమల ప్రాంతంలో మండు టెండలు మొదలయ్యాయి. ఓ వైపు అడవుల్లో తరుచూ కార్చిచ్చు రగులుతూ హెక్టార్ల కొలది అడవి దగ్ధమవుతూ ఉన్నాయి. స్వాములు నడకలో దూరాన్ని తగ్గించుకునేందుకు చాలా మంది శివస్వాములు మన్ననూరు నుంచి వటవర్లపల్లి వరకు అడవి మార్గంలో వెళ్తుంటారు. ఇది ఎంత మాత్రం స్వాములకు సురక్షితం కాదని స్థానిక అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. నల్లమల అభయారణ్యం చాలా పెద్దగా ఉండటంతో 2008లో శివస్వాములు దారి తప్పిన సంఘటన సంచలనమైంది. అప్పట్లో అడవిలో దారి తప్పిపోయిన శివస్వాములను హెలికాప్టర్ ద్వారా గాలించి ప్రభుత్వం రక్షించింది. రెండేళ్ల క్రితం పెద్దపులిని చూసి స్వాములు పరుగు పెట్టి దారి తప్పి పశువుల కాపర్ల సహాయంతో వటవర్లపల్లి గ్రామానికి చేర్చారు. ప్రస్తుతం నల్లమలలో కార్చిచ్చు కారణంగా పెద్దపులులు, చిరుత పులులతో పాటు ఇతర వన్యప్రాణులు వేడి తాపానికి చెదురుమదురై అడవంతా కలియ తిరుగుతుంటాయి. వాటి నుంచి దాడులు జరిగే ఆ స్కారమూ లేకపోలేదని, శివస్వాములు సహకరించి రహదారి మార్గంలోనే వెళ్లాలని అటవీ శాఖ భక్తులకు విజ్ఞప్తి చేస్తోంది.

అత్యంత రద్దీ..

మహా శివరాత్రి ఉత్సవాలు శ్రీశైలం క్షేత్రం ఎంతో ప్రత్యేకం కానుండగా పాదయాత్రగా వెళ్లే స్వాములు, వాహనాల్లో వెళ్లే శివ భక్తులు, పర్యాటకుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచే కాక ఉమ్మడి పాలమూరు, నల్గొండ, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి ఎక్కువగా శ్రీశైలం క్షేత్రానికి వెళ్తుంటారు. మార్చి మొదటి వారం నుంచి మహా శివరాత్రి జాతర ముగిసే వరకు నల్లమలలో రద్దీ అధికంగా ఉంటుంది.

రూట్ మ్యాప్ ఇలా..

మహబూబ్‌నగర్ నుంచి వచ్చే భక్తులు అచ్చంపేట, మన్ననూరు మీదుగా,హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు హాజీపూర్ చౌరస్తా నుంచి శ్రీశైలం మార్గంలో మన్ననూరు మీదుగా, నల్గొండ వైపు నుంచి వచ్చే వారు డిండి, హాజీపూర్ మీదుగా శ్రీశైలం క్షేత్రానికి వెళ్లవచ్చు. పాదయాత్ర స్వాములు మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వారు అచ్చంపేట మీదుగా ఉమామహేశ్వరం, హైదరాబాద్, నల్గొండ ప్రాంతాల నుంచి వచ్చే వారు డిండి మార్గంగా, ఓంకారేశ్వర పరమిడ్ మార్గంలో రంగాపూర్ చేరుకొని అక్కడి నుంచి ఉమామహేశ్వరం చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ స్వాములకు విశ్రాంతి తీసుకునే సౌకర్యాన్ని ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఇక్కడ స్వాములకు మూడు పూటలా భిక్ష చేసుకునే అవకాశాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. ఉమా మహేశ్వరం నుంచి అడవి మార్గంలో మూడు కిలో మీటర్లు కొండ దిగితే మన్ననూరుకు చేరుకోవచ్చు. మన్ననూరు నుంచి నేరుగా శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై వటవర్లపల్లి, శ్రీశైలం ప్రాజెక్టు పాతాళగంగ మీదుగా శ్రీశైలం చేరుకోవచ్చు.

మూడు చలివేంద్రాల ఏర్పాటు..



మన్ననూరు నుంచి దోమల పెంట వరకు శివస్వాములకు దాహార్తి తీర్చేందుకు ఏటీఆర్ ఆధ్వర్యంలో మూడు చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. రహదారి మార్గమే శివస్వాములకు సురక్షితం. అడవీ మార్గం నిషేధించారు. పెట్రోలింగ్ వాచర్లను ఏర్పాటు చేశాం. శివరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు మూడు పెట్రోలింగ్ బృందాలు శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించి భక్తులకు ప్లాస్టిక్ వ్యర్థాలు అడవుల్లో పారేయరాదని, అడవిలో ఎక్కడా పొయ్యి పెట్టి వంటలు చేయరాదని అవగాహన కల్పిస్తాం.

- ఈశ్వర్, ఎఫ్ఆర్‌వో, మన్ననూరు

ఎడమ పాతాళగంగలో ఏర్పాట్లు శూన్యం



పాతాళగంగలో తడకల నీడన సేద తీరుతున్న భక్తులు

దోమలపెంట, ఫిబ్రవరి 29 : నల్లమల కొండల్లో కొలువుదీరిన భ్రమరాంబిక మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక మొదలగు రాష్ట్రాల నుంచి భక్తులు శివనామ స్మరణతో తండోపతండాలుగా పాదయాత్రగా తరలివస్తారు. శ్రీశైలం బ్రహ్మోత్సవాలలో శివపార్వతుల కల్యాణం వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నల్లమల కొండల మీదుగా పాదయాత్రగా వెళుతున్నారు. కనీసం భక్తులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా మరుగు దొడ్లు, మూత్రశాలలు లేవు. తాగేందుకు నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఉంది. ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం తరుపున ఎటువంటి ఏర్పాట్లు చేపట్టలేదు. 2016 సంవత్సరంలో జరిగిన కృష్ణా పుష్కరాలకు ఎడమ పాతాళగంగ పుష్కర ఘాటుకు రూ. 10 కోట్లకుపైగా ఖర్చు చేసి, 120 తాత్కాలిక మరుగుదొడ్లు, 60 డ్రెస్సింగ్ రూంలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం అటువంటి ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ముందుకు రావడంలేదు. శివరాత్రి ఉత్సవాలలో ఆదాయం ఆంధ్ర ప్రాంతానికి చేరుతుందన్న ఉద్దేశంతో తెలంగాణ వైపున ఏర్పాట్లు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

దేవస్థానం వారు ఏర్పాట్లు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వటువర్లపల్లి, దోమలపెంట, పాతాళగంగ ప్రాంతాల్లో అన్నదానం, నీటి పసతి, అల్పాహారం తదితర వసతులను శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసేవారు. గత 10 సంవత్సరాల నుంచి తెలంగాణ వచ్చిన తరువాత ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

- బుద్దాల ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్, దోమలపెంట

లీపు సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 21 మంది జననం



అలంపూర్, నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన ఆడపిల్లలు

గద్వాల న్యూటౌన్/నారాయణపేట వైద్యవిభాగం/జడ్చర్ల/వనపర్తి వైద్యవిభాగం, ఫిబ్రవరి 29 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే లీపు సంవత్సరం ఫిబ్రవరి 29, గురువారం ఇరవై మంది జన్మించారు. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎనిమిది మంది జన్మించగా, వారిలో ఆరుగురు మగ శిశువులు, ఒక ఆడ శిశువు ఉన్నది. గట్టు ప్రాథమిక ఆసుపత్రి పరిధిలో ఇద్దరు మగ పిల్లలు, ధరూర్ పీహెచ్‌సీ పరిధిలో ఒక మగ పిల్లవాడు. అయిజ పీహెచ్‌సీ పరిధిలో మగ పిల్లవాడు, ఇటిక్యాల పీహెచ్‌సీ పరిధిలో మగ పిల్లవాడు పుట్టారు. మానవపాడు పీహెచ్‌సీ పరిధిలో ఒక ఆడ శిశువు, అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడపిల్ల జన్మించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక మగ శిశువు పుట్టాడని సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌క్రాంతి చెప్పారు. అదే విధంగా నారాయణపేట జిల్లా ఆసుపత్రిలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన గౌరమ్మ గురువారం పండంటి పాపకు జన్మనిచ్చింది. అదే విధంగా జిల్లా ఆసుపత్రిలో మూడు సీజేరిన్ ఆపరేషన్లు కాగా మద్దూర్ మండలం భీమ్‌పూర్‌కు చెందిన సంగీత, మద్దూర్‌కు చెందిన అంజమ్మ, కర్ణాటక తోరణదిబ్బకు చెందిన శంకరమ్మకు ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. జడ్చర్ల పట్టణంలోని సుఖదాదేవి నర్సింగ్ హోంలో లీపు సంవత్సరమైన ఫిబ్రవరి 29న బాబు జన్మించాడు. భూత్పూర్ మండలం మొల్గర గ్రామానికి చెందిన సైనాజ్‌బేగం, లుక్మాన్ జంటకు మగబిడ్డ జన్మించాడు. మొదటి సంతానం, అదీ లీపు సంవత్సరంలో పుట్టడం ఎంతో సంతోషంగా ఉందంటూ వారు ఆనందం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఎనిమిది మంది నవజాత శిశువులు జన్మించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీహెచ్‌లో జన్మించిన నవజాత శిశువుల్లో నలుగురు సాధారణ ప్రసవం కాగా, మరో నలుగురు ఆపరేషన్ చేయడం ద్వారా జన్మించారు.

చిన్నారెడ్డి సమక్షంలో లీప్ జన్మదినం..

పట్టణానికి చెందిన ఎం.వెంకటేష్ లీప్ సంవత్సరంలో జన్మించాడు. 2004వ సంవత్సరంలో జన్మించిన ఎం.వెంకటేష్ తన జన్మదిన వేడుకల కోసం ఆశగా నాలుగేళ్లు ఎదురు చూస్తుంటాడు. ప్రస్తుతం అతని వయసు 20 సంవత్సరాలు. కాగా కేవలం ఐదుసార్లు మాత్రమే పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నాడు. తాజాగా తన జన్మదిన వేడుక ప్రత్యేకంగా ఉండాలని గురువారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చిన్నారెడ్డి సమక్షంలో జరుపుకున్నాడు. దీంతో చిన్నారెడ్డి కేక్ కట్ చేయించి వెంకటేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తిథి ప్రకారం ఏటా జరుపుకుంటాం

తిథి ప్రకారం ప్రతీ సంవత్సరం వివాహ వార్షిక వేడుకలను జరుపుకుంటామని శ్రీకాంత్ శర్మ, స్వాతి స్పష్టం చేశారు. నారాయణపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హన్మేష్, రేవతిల మూడో కుమార్తె అయిన స్వాతికి దౌల్తాబాద్‌కు చెందిన శ్రీకాంత్‌తో లీపు సంవత్సరం గురువారం వివాహం జరిగింది. తేదీ ప్రకారం ఇంగ్లిష్ సంవత్సరం ప్రకారం నాలుగేళ్ల కోసారి వార్షిక వేడుకలను జరుపుకుంటామన్నారు. అలాగే నారాయణపేటకు చెందిన గాళ్ల బస్వరాజ్ కుమారుడు ప్రవీణ్‌కు బీజాపూర్‌కు చెందిన విద్యావాణితో పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిగింది. మంచి శుభ ముహూర్తం ఉండడంతో వివాహం జరుపుకున్నామని అది లీపు సంవత్సరం ఫిబ్రవరి 29 మరచిపోని దినమని వారు ఆనందరం వ్యక్తం చేశారు.

ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



వీరాపురం రామకృష్ణ

గద్వాల టౌన్, ఫిబ్రవరి 29 : జోగుళాంబ గద్వాల జిల్లా వీరాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తెలంగాణ గురుకుల పాఠశాలల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలను ఆయన సాధించారు. గొల్లపెద్ద బీచుపల్లి, మహేశ్వరమ్మ దంపతుల కుమారుడైన రామకృష్ణ ప్రాథమిక విద్యను వీరాపురంలోనే పూర్తిచేశారు. గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్న ఆయన, ఎస్‌వీఎం కళాశాలలో ఇంటర్మీడియట్, గద్వాల ఎంఏఎల్‌డీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంకాం, బీఈడీ చదువుకొని రెండేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమైన ఆయన ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి, అభినందనలు అందుకున్నారు.



ఇంద్రకంటి వెంకటేశ్వర్లు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామానికి చెందిన ఇంద్రకంటి వెంకటేశ్వర్లు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్దకార్పాముల గ్రామానికి చెందిన అలివేలమ్మ చంద్రమౌళిల కుమారుడు వెంకటేశ్ వారిది పేద కుటుంబం. తల్లిదండ్రుల కల నెరవేర్చాలనే లక్ష్యంతో పట్టుదలతో కష్టపడి చదివి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల జరిగిన గురుకుల ఉద్యోగ పోటీ పరీక్షలో ఇంద్రకంటి వెంకటేశ్వర్లు జూనియర్ లెక్చరర్, టీజీటీ, పీజీటీలలో ప్రభుత్వ ఉద్యోగాలు ఒకేసారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో సాధించారు. మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఇంద్రకంటి వెంకటేశ్వర్లును గ్రామ పెద్దలు, మిత్రులు ఇంద్రకంటి శేఖర్, మెరుగురాజు, సాతాని శ్రీనివాసులు అభినందించారు.



సంతోష రెడ్డి

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 29 : మండలంలోని దాసరిపల్లె గ్రామానికి చెందిన లంకాల సంతోషరెడ్డి ఒకే సారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గురుకులాలు, జేఎల్ ఫలితాల్లో గురుకుల, జూనియర్ లెక్చరర్, గణితంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. అంతకు పూర్వం విడుదలైన గురుకుల ఫలితాల్లో గురుకుల పీజీటీ, గురుకుల టీజీటీ, ఉద్యోగాలకు ఎంపికైంది. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని, తనకు నచ్చిన జూనియర్ లెక్చరర్ మ్యాథమెటిక్స్‌లో జాయిన్ అవుతానని సంతోషరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు అభినందించారు.

● అడ్డాకుల : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు చెందిన వి.కౌసల్య ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైంది. వన్నం శ్రీహరి, వసంత కూతురు అయిన కౌసల్యకు ఇటీల కె.మల్లేష్ అనే వ్యక్తితో వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో జేఎల్, డీఎల్ పోస్టులకు ఆమె ఎంపికైంది.

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఖమ్మం జట్టు

» రన్నర్‌గా నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు

» మూడో స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 29 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్ల మినీస్టేడియం, గంగాపురానికి వెళ్లే మరో మైదానంలో నాలుగు రోజుల పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఖమ్మం జిల్లా జట్టు నిలిచింది. ఫైనల్స్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జిల్లా జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్‌లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జిల్లా జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్‌లు కోల్పోయి కేవలం 86 పరుగులు మాత్రమే చేసి రన్నర్‌గా నిలిచింది. 36 పరుగుల తేడాతో గెలిచి టోర్నమెంట్ విజేతగా ఖమ్మం జిల్లా జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మూడో స్థానంలో, హైదరాబాద్ జిల్లా జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు, ఖమ్మం జిల్లా జట్లు తలపడగా ఖమ్మం జిల్లా జట్టు గెలిచి ఫైనల్స్‌కు వెళ్లింది. దీంతో మూడోస్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నిలిచింది. సెమీఫైనల్స్ మ్యాచ్ ఆడుతున్న మహబూబ్‌నగర్ జిల్లా జట్టుతో పాటు ఖమ్మం జిల్లా జట్టు క్రీడాకారులను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరిచయం చేసుకున్నాడు. అనంతరం మ్యాచ్‌ను కొద్దిసేపు తిలకించారు. విజేతలకు జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంఈవో మంజులాదేవి ట్రోఫీ, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సభ్యులతో పాటు పీఈటీలు మోయిన్, కిట్టు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెద్దమందడి, ఫిబ్రవరి 29 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తుండగా గురువారం రాత్రి వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మొల్గరలో మరొకటి..

ఉప్పునుంతల : అనుమతులు లేకుండా అక్రమంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని మొల్గర సమీపంలోని దుందుభీ వాగు నుంచి గురువారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ ఉల్పర ఎల్ల స్వామి అక్రమంగా లక్ష్మాపూర్ నుంచి మర్రిపల్లికి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు వెంకటేష్, బానుప్రకాష్‌రెడ్డి ప ట్టుకొని పరిశీలించగా అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. ఎస్సై లెనిన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

ఆత్మకూరు, ఫిబ్రవరి 29 : పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన సంఘటనలో యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శివకుమార్ తెలిపిన ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి నాలుగు సంవత్సరాలుగా ఆమెతో కలిసిమెలసి ఉన్నాడు. తీరా పెళ్లి చేసుకోవాలని యువతి కోరడంతో నాకు మరో యువతితో పెళ్లి నిశ్చయమైందని దాటవేశాడు. దీంతో యువతి గురువారం ఆత్మకూరు పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శివకుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, ఫిబ్రవరి 29 : జడ్చర్ల మునిసిపాలిటీలోని సరస్వతి నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన పాపిశెట్టి చంద్రకళ గత నెల 27న ఇంటికి తాళం వేసి, బంధువుల ఇంటికి వెళ్లి, మరుసటి రోజు ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చే చూసే సరికి ఇంటి తలుపుల తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందచేసింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. కాగా 40తులాల వెండి సామగ్రి, కొంత నగదు చోరీకి గురయ్యాయని బాధితురాలు చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 29 : వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వనపర్తి పట్టణ ఎస్సై జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌కాలనీలో చల్లా శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి తొమ్మిదిమందిని అరెస్టు చేయడంతో పాటు, రూ.27వేల 707 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో చల్లా శేఖర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వరప్రసాద్, మన్నెం, విజయ్, శ్రీనివాసులు, రాములు, రఘు, అయోధ్య ఉన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



అయూబ్‌ఖాన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

అమరచింత, ఫిబ్రవరి 29 : లీప్ సంవత్సరంలో జన్మించిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు అయూబ్‌ఖాన్‌కు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అయూబ్‌ఖాన్ జన్మదిన వేడుకను తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఆయన ఇంటికి వెళ్లి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు, రాజవలి దర్గా కమిటీ సభ్యులు ఉన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

» జిల్లా సంక్షేమ అధికారిణి లక్ష్మీబాయి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారిణి లక్ష్మీబాయి

గోపాల్‌పేట, ఫిబ్రవరి 29 : బాలబాలికలు అందరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా సంక్షేమ అధికారిని లక్ష్మీబాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు శ్రద్ధతో చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు వెంబడించినా చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో కృష్ణచైతన్య, పీవోఎస్‌ఐసీ సురేందర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రాజేష్‌కుమార్, కేసు వర్కర్లు రాజు, బాలరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతరాణి, కస్తూర్బాగాంధీ ఎస్‌వో దీప్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వృత్తి వ్యాపార అనుమతి పొందాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 29 : ఆత్మకూరు పట్టణంలోని వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న యజమానులు వృత్తి వ్యాపార లైసెన్స్‌లు పొందాలని పురపాలక కమిషనర్ నాగరాజు తెలిపారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని వృత్తి వ్యాపార సముదాయాలను ఆయన పరిశీలించారు. ఇదివరకే వ్యాపార సముదాయాలు నిర్వహించే యజమానులు అనుమతులు పొందాలని సూచించినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇది సరైంది కాదని తెలిపారు. 2019 పురపాలక సంఘం చట్ట ప్రకారం వ్యాపార లైసెన్స్ పొందాలని, లేకపోతే ఎలాంటి దరఖాస్తులు ఇవ్వకుండానే దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 29 : ఉద్యోగ నియామక పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువత ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారిని నుశిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్టడీ సర్కిల్ మహబూబ్‌నగర్‌లో గ్రూప్-1,2,3,4 పరీక్షలకు ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుతో పాటు, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ పరీక్షలకు కూడా శిక్షణ ఇస్తారన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చివరి తేదీ మార్చి 6వ తేదీ అని తెలిపారు.

హామీలను అమలు చేస్తున్న సర్కార్‌కు సలాం

కొత్తకోట, ఫిబ్రవరి 29 : ఎన్నికల్లో హామీలు ఇచ్చి వంద రోజులకు ముందే అమలు చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సలామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయోజ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో బోయోజ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజునే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.పది లక్షలకు పెంచడం జరిగిందన్నారు. నిన్న గృహజ్యోతి పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అలాగే, నిరుద్యోగ యువతకు గ్రూప్స్ నోటిఫికేషన్లు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల నమ్మకంతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని వారు కోరారు.

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 29 : ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బాలల పరిరక్షణ విభాగం వర్కర్ నరేష్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని బాలికల పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వయసులో వ్యసనాలకు గురికావద్దని, విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో సంబంధాలు కలిగి ఉండరాదని సూచించారు. బాల్య వివాహాలకు పాల్పడితే 2006 చట్టం ప్రకారం జైలుశిక్ష, జరిమానా తప్పదని సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవి, రాజు, ఉపాధ్యాయులు ఇందిర, సురేఖ, జమునరాణి పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలని ఎంపీవోకు వినతి

అమరచింత, ఫిబ్రవరి 29 : ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్, కొత్త గ్రామ పంచాయతీలో ఎఫ్ఏల నియామకాలను తక్షణమే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఎంపీవో నరసింహయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ చంద్రప్పతండా, ధర్మాపూర్, చింతరెడ్డిపల్లి, కిష్టంపల్లి కొత్త గ్రామ పంచాయతీలో సీనియర్ మేట్‌లుగా పనిచేసిన వారికి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకాలు చేపట్టాలని, అదేవిధంగా నాగర్‌కర్నూల్ సింగంపేట, మస్తీపూర్, మిట్ట నందిమల్లలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు అజయ్, శంకర్, బొక్కెం కురుమన్న, నిశాంత్, బాలస్వామి, ఆంజనేయులు ఉన్నారు.

'జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి'

అమరచింత, ఫిబ్రవరి 29 : ఖమ్మంలో ఈనెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు జరిగే సీపీఐఎంఎల్ మాస్ లైన్ యూనిట్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు గురువారం అమరచింతలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో సమసమాజం నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు రాజ్యం రావాలని ఆశతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హనుమంత్, మండల కార్యదర్శి ఎల్‌ఐసీ రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, సామెల్, సత్యం, విజయ్, గౌస్, కురుమన్న, వెంకటేష్ తదితరులున్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

చిన్నంబావి, ఫిబ్రవరి 29 : బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏనుగు గుర్తుకు ఓటేద్దాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే వాల్‌పోస్టర్‌ను బీఎస్పీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు బొల్లి కురుమయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగమే మేనిఫెస్టోగా కలిగిన ఏకైక జాతీయ పార్టీ బీఎస్పీ అని అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు వెంకటేష్, భాను, సాయికుమార్, గోవిందు, రామకృష్ణ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

వనపర్తి టౌన్/రేవల్లి, ఫిబ్రవరి 29 : రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి పలువురు భారీగా చేరారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో చిన్నారెడ్డి సమక్షంలో రేవల్లి మండల జడ్పీటీసీ సభ్యుడు భీమయ్య, మాజీ ఎంపీపీ జానకిరాంరెడ్డి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్లు సహదేవ్‌యాదవ్, రఘుయాదవ్, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తోమాలపల్లి కృపాకర్‌రెడ్డి, జానంపేట మహేశ్వర్‌రెడ్డి వంటి వివిధ మండలాల నాయకులు చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, పట్టణ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, యాదయ్య, దివాకర్‌యాదవ్, దిలీప్, బాబా, అబ్దుల్లా, రాగివేణు ఉన్నారు.

సొంత గూటికి చేరిన మాజీ సర్పంచు

పెద్దమందడి : మండలంలోని మోజర్ల గ్రామానికి చెందిన సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచు మార్క నాగరాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన గురువారం తన అనుచర వర్గంతో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరినవారిలో రైతు సమితి గ్రామ మాజీ అధ్యక్షుడు కానాయపల్లి నాగన్న, మాజీ వార్డు మెంబర్ మొగిలి శ్రీధర్‌రెడ్డి, గడ్డం నిరంజన్‌రెడ్డి, రాయికంటి రాములు, సింగం శ్రీనివాసులు, అనిల్‌యాదవ్ తదితరులున్నారు.

మునిసిపల్ అవిశ్వాసంపై పట్టణంలో వాడీ వేడి చర్చ

» వీగిపోవడానికి ప్రయత్నిస్తున్న ఛైర్మన్

» నెగ్గడానికి సమావేశాలు జరుపుకుంటున్న విపక్షాలు

అమరచింత, ఫిబ్రవరి 29 : మునిసిపల్ పాలక మండలిపై అవిశ్వాస నోటీసులు అందించడంపై పట్టణంలో ఎటు చూసినా వాడివేడి చర్చ కొనసాగుతోంది. ఒకవైపు అవినీతి ఆరోపణలు సొంత పార్టీ కౌన్సిలర్ విపక్షాలతో కలవడం మరోపక్క పట్టణంలో భూకబ్జా వ్యవహారం తారాస్థాయికి చేరడం ఇదే తరుణంలో తాజాగా సొంత పార్టీ వారే ప్రతిపక్ష కౌన్సిలర్లతో వెళ్లి అవిశ్వాసానికి తెర లేపడంపై ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎవరి ప్రయత్నం వారిది

అవిశ్వాస నోటీసుకు ఆరుగురు కౌన్సిలర్లు సంతకాలు పెట్టి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు బుధవారం అందజేయడంతో ఒక్కసారిగా పట్టణంలో రాజకీయాలు మారిపోయాయి. ఛైర్మన్‌తో పాటు ఆయన అనుకూల వర్గాలు మాత్రం అవిశ్వాసం వీగే విధంగా ప్రయత్నం చేస్తుండగా విపక్ష కౌన్సిలర్లు మాత్రం రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకుని అవిశ్వాసం నెగ్గే విధంగా చర్చలు జరుపుకుంటున్నారు. మునిసిపాలిటీలో పదిమంది కౌన్సిలర్లకు బీఆర్‌ఎస్‌కు ఐదుగురు, సీపీఎంకు ఇద్దరు, బీజేపీకి ఇద్దరు, సీపీఐకి ఒకరు కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం నోటీసులో బీజేపీకి ఇద్దరు, సీపీఐకి ఒకరు, సీపీఎంకు ఒకరు, సొంత పార్టీ బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు ప్రతిపక్షాలతో కలిసి సంతకాలు చేసి కలెక్టర్‌కు నోటీసు అందజేయడం చర్చకు ప్రాధాన్యత సంతరించుకుంది.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

» అధికారులు బాధ్యత వహించాలి

» కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 29 : పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో చీఫ్ సూపరింటెండెంట్లు ప్రధాన బాధ్యత వహించాలని, ఉదాసీనతకు వీల్లేదని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో జిల్లా విద్యాశాఖ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎంఈవోలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎలాంటి అలసత్వం కానీ, ఉదాసీనతకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 6,906 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించడం, వాటిని కేంద్రంలో లెక్క ప్రకారం తీసుకోవడం, తిరిగి సమాధాన పత్రాలను పోస్టు ద్వారా పంపే వరకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. అధికారులు పరీక్షల షెడ్యూల్, మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ అనుమతి లేదని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులతో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థికి హాల్‌టికెట్ జారీ చేసే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఎంఈవోలను ఆదేశించారు. సమావేశంలో డీఈవో గోవిందరాజులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

» జిల్లా పరిషత్ సీఈవో యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో యాదయ్య

పాన్‌గల్, ఫిబ్రవరి 29 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ సీఈవో యాదయ్య అన్నారు. గురువారం పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు, నర్సరీల పర్యవేక్షణ, తాగునీటి సమస్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా తాగునీటి సమస్యపై దృష్టి సారించాలన్నారు. బోర్ల మరమ్మతులు, పైపులైన్‌లో లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేసి తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఇంటి పన్నుతో పాటు, నల్లా బిల్లులను వందశాతం వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి పనుల వద్ద వసతులు కల్పించాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నిత్యం పర్యవేక్షణ చేసి వేసవిలో మొక్కలను సంరక్షించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాం, ఏపీవో కురుమయ్య తదితరులున్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

ఖిల్లాఘణపురం/ఆత్మకూరు, ఫిబ్రవరి 29 : ఖిల్లాఘనపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రాధ తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 133 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా నలుగురు గైర్హాజరు కాగా 129 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించినట్లు ఆమె వివరించారు. అదే విధంగా, ఆత్మకూరులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 335 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 315 మంది విద్యార్థులు హాజరయ్యారని, అలాగే వికాస్ జూనియర్ ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 131కి గాను 129 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు వివరించారు.

పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



సీవీ రామన్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తూ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి రూరల్ : ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో పరీక్షల కేంద్రం వద్ద పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి సిబ్బందికి సూచించారు. గురువారం వనపర్తి పట్టణంలోని సీవీ రామన్, త్రివేణి జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది గుమిగూడవద్దని అన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి యుగంధర్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 29 : ఇంటర్, పదవ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని, భయపడకుండా పరీక్షలు రాయాలని మండల ప్రత్యేక అధికారి యుగంధర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీసీ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యుగంధర్‌రెడ్డి మాట్లాడారు. భవిష్యత్‌లో మంచిగా స్థిరపడాలంటే ఇంటర్మీడియట్‌లో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని, చదువుక్కొటే ధ్యాసగా ఉండాలన్నారు. అంతకుముందు హాస్టల్ భవనాన్ని, భోజనాన్ని ఆయన పరిశీలించారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు

కొత్తకోట, ఫిబ్రవరి 29 : మండలంలోని పామాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. డీఈవోగా అనూష, ఎంఈవోగా వైష్ణవి, హెచ్‌ఎంగా దినేష్, ఉపాధ్యాయులుగా అక్షిత, ఉమాశ్రీ, చిత్ర, శివలీల, ప్రశాంతి, ధరణి, వైష్ణవి, సంపత్‌కుమార్, శివకుమార్ వ్యవహరించారు. ఉత్తమ బోధన చేసిన విదార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పృథ్వీమాత, నుశ్రాత్‌బేగం, శరత్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వీపనగండ్లలో...

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అంకిత డీఈవోగా, అభినయ్ ఎంఈవోగా, వెంకటేష్ హెచ్‌ఎంగా, 42 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు బోధన చేశారు. బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ, రాజస్వప్న, శేఖర్, రాధాస్వామి, సీఆర్పీ వెంకటేష్ తదితరులున్నారు.



పామాపురంలో పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు

వ్యవసాయ రంగానికి మంచి భవిష్యత్



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో విద్యార్థినులు

రేవల్లి, ఫిబ్రవరి 29 : భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి, వ్యవసాయదారులకే ప్రాముఖ్యత ఉంటుందని, వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత గురించి స్ఫూర్తిదాయకమైన మాటలతో విద్యార్థినులకు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. గురువారం రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో ఓ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అదే గ్రామంలో సామాజిక విజ్ఞాన కళాశాల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థినుల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అదేవిధంగా భవిష్యత్తులో వ్యవసాయ ప్రాముఖ్యతను గురించి వారికి వివరించారు. వీరి వెంట అధ్యాపకురాలు రాధికాదములూరి, సుప్తాసర్కార్, గ్రామ మాజీ సర్పంచ్ రమేష్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కురుమయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సత్తార్, బిచ్చయ్య, మద్దిలేటి, మల్లయ్య, విద్యార్థినులు, గ్రామస్థులు ఉన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

» డీఆర్‌డీవో ఉమాదేవి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ఉమాదేవి

పాన్‌గల్, ఫిబ్రవరి 29 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను హరితహారం నాటికి సిద్ధం చేయాలని డీఆర్‌డీవో ఉమాదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్నారం, గోప్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. మొక్కలకు ప్రతీరోజు నీరు పోయాలని, షిఫ్టింగ్ చేసి మొక్కలు ఎండిపోకుండా సంరక్షించి, హరితహారం నాటికి సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో కూలీలు చేపడుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గోప్లాపూర్ గ్రామంలో ఆసరా పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో కోటేశ్వర్, ఏపీవో కురుమయ్య, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

మదనాపురం, ఫిబ్రవరి 29 : సమాజంలో అంటరానితనం నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని నర్సింగాపురం గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో కులాల మధ్యన హెచ్చుతగ్గులు ఉండొద్దని, అందరు సమాన భావంతో జీవించాలని అన్నారు. గ్రామంలో రెండు గ్లాసుల విధానం, ఆలయాల ప్రవేశాలకు నిషేధం విధిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, గ్రామస్థులు వెంకటేష్, కురుమూర్తి, నాగన్న, రాములు, కావలి అంజి, రాంచందర్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 29 : మండలంలో ఈనెల మూడో తేదీ నుంచి మూడురోజుల పాటు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆయిదు సంవత్సరాలలోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మండలంలో 4,237 మంది చిన్నారులకు 28 కేంద్రాల ద్వారా మూడు బృందాలు, ఒక మొబైల్ టీం చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, సతీష్, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ ఛైర్మన్‌కు ఐజేయూ నాయకుల శుభాకాంక్షలు

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 29 : తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఐజేయూ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డికి టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, వనపర్తి జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు మాల్యాల బాలస్వామిలు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పట్ల సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తితో పాటు, గతంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డికి మరోసారి మీడియా అకాడమీ ఛైర్మన్‌గా నియమించినందుకు ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజస్తంభ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల

మదనాపురం, ఫిబ్రవరి 29 : మండలంలోని కొన్నూరు పెద్దతండాలో జరిగిన ధ్వజస్తంభ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం తండాలో ఆంజనేయస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద ధ్వజస్తంభ వేడుకల ప్రతిష్ట జరిగింది. వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్లి యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి

కొత్తకోట, ఫిబ్రవరి 29 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ టికెట్ దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ఇవ్వాలని మునిసిపల్ ఛైర్‌పర్సన్ సుకేశిని కోరారు. గురువారం తన గృహంలో ఆమె కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆల పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి వెనకబడిన దేవరకద్ర నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాడన్నారు. కాంగ్రెస్ గాలిలో అతి తక్కువ ఓట్లతో ఓటమి చెందడాన్ని గుర్తు చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, కౌన్సిలర్లు రాములుయాదవ్, తిరుపతి, నాగన్నసాగర్, ఖాజామైనొద్దీన్, అయ్యన్న, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

డీఎస్సీ ప్రకటనపై టీఎస్‌యూటీఎఫ్ హర్షం

గోపాల్‌పేట, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీలో దాదాపు 11,068 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీఎస్‌యూటీఎఫ్ గోపాల్‌పేట, రేవల్లి మండల శాఖలు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాయి. డీఎస్సీ విడుదలతో బీఈడీ చేసిన నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హమీద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగన్న, సూరయ్య, రేవల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు గంధంకృష్ణ, రాములుయాదవ్ తదితరులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన

చిన్నంబావి, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని బెక్కెం గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం బాల్య వివాహాలు, ఆడపిల్లల రక్షణ, ఓటరు నమోదుపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యురాలు సువర్ణ, శ్రీనివాసులు, కృష్ణయ్య, లింగయ్య, బోనాసి రాజు, నరసింహ, రాధా, శ్రీదేవి, కళాబృంద సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయ నిర్మాణానికి పునాది

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 29 : జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ వీధిలో గురువారం దుర్గామాత ఆలయ నిర్మాణానికి పునాది వేశారు. రాయిగడ్డ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమం ప్రారంభించారు. అర్చకులు విశేష పూజల అనంతరం దుర్గా అమ్మవారికి పూలమాలలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి రంగం వెంకటస్వామి, మండ్ల దేవన్ననాయుడు, సింగనమోని ఆంజనేయులు, ఆర్టీ కిరణ్, బోయిని తిరుమల్, డాన్ మన్యం, నందిమల్ల వెంకటస్వామి, చాపల రాములు తదితరులున్నారు.

నేటి నుంచి రాజవలి దర్గా ఉత్సవాలు

అమరచింత, ఫిబ్రవరి 29 : మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న రాజవలి దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం గంధోత్సవం, శనివారం చాదర్ ఊరేగింపు, కవాలి, ఆదివారం అన్నదానం ముగింపు ఉత్సవాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు పాలమూరు ఉమ్మడి జిల్లాతో పాటు, పక్కన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సభ్యులు తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

» ఉపాధి హామీ పనుల పరిశీలనలో ఎంపీడీవో వెంకటాచారి

ఖిల్లాగణపురం, ఫిబ్రవరి 29 : మండలంలోని కర్నేతండా, ఆముదంబండ తండా, సోలీపూర్ గ్రామాల్లో గురువారం చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వెంకటాచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా పనులను చేపట్టాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీ పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు. పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించి, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. అడవిలోని జీవరాసులకు తాగునీరు అందేలా కొండ ప్రాంతాల దిగువ భాగాన కుంటలు ఏర్పాటయ్యేలా చూడాలని సూచించారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటాచారి